సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023




తల్లిదండ్రులకూ పరీక్షే..!
పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే ఎగ్జామ్ సెంటర్ అందుబాటులో లేక పోవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పట్లేదు. 8లో ▸



శివపార్వతుల కల్యాణం
గుడిహత్నూర్‌లోని శివాలయంలో నిర్వహిస్తున్న సప్తాహం ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. హనుమాన్ దీక్షాపరులు రథాన్ని లాగారు. 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.0/24.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు



పోస్టర్ విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ నటరాజ్

కైలాస్‌నగర్: వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 816 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశముందని, ఇందు కోసం కోసం నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. టార్పాలిన్లు, తేమ శాతం నిర్ధారణ యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ సుధారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

'ఆదివాసీలను మోసం చేస్తే కఠిన చర్యలు'

ఆదిలాబాద్‌టౌన్: కొంతమంది ఆదివాసీ నాయకులు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని మోసం చేస్తూ ఆదివాసీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రకటనలో హెచ్చరించారు. ఆదివాసీలు నాయకులను నమ్మి మోసపోవద్దని, సర్వే నంబర్ 72 కోర్టులో ఉన్నందున అది తేలే వరకు సంయమనం పాటించాలని సూచించారు. మాయమాటలు చెప్పే వారిని ఆదివాసీలు నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి కూడా డబ్బులు ఇవ్వవద్దని పేర్కొన్నారు. మోసం చేస్తున్న వారి వివరాలు సేకరించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హనుమాన్ ర్యాలీకి పోలీసుల అనుమతి తప్పనిసరి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే ర్యాలీలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు ముందుగానే సంబంధిత పోలీసు అధికారులకు ర్యాలీలో పాల్గొనే సభ్యుల సంఖ్య, పట్టణంలో ప్రయాణించే మార్గాన్ని తెలియజేయాలని పేర్కొన్నారు. కచ్చితంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. హనుమాన్ భక్తులు ర్యాలీని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే డీజేలకు అనుమతి లేదని పేర్కొన్నారు.

రేపు జగ్జీవన్ రామ్ జయంతి

కైలాస్‌నగర్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఈ నెల 5న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 గంటలకు ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యాలయ ఆవరణలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి, ఉదయం 8:40 గంటలకు జెడ్పీ క్వార్టర్స్ చౌరస్తాలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలంకరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఆదిలాబాద్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మహేశ్ అన్నారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర నాయకుడు అల్లాపూర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణపై 28 సంవత్సరాలుగా పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ స్వామి, బాలాజీ, సుభాష్, రవి పాల్గొన్నారు.

ప్రతిభ.. ఉత్తదేనా!

- పాఠశాలలకే నేరుగా ప్రశ్నపత్రాలు
- ఉపాధ్యాయులతో పరీక్ష రాయిస్తూ..
- విద్యార్థులకు జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులంటూ ప్రచారం
- టాలెంట్ టెస్ట్‌ల పేరిట ప్రైవేట్ పాఠశాలల జిమ్మిక్కులు

- బోథ్ మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి తన కుమారుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాడు. చదువులో వెనకబడ్డ ఆ విద్యార్థికి గతేడాది ఓ సంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్టులో జిల్లాస్థాయి మొదటి ర్యాంకు వచ్చింది. ఆరా తీస్తే తామే ర్యాంకును మేనేజ్ చేశామని సదరు పాఠశాల యాజమాన్య సభ్యుడే పేర్కొనడం గమనార్హం. తన కుమారుడు ర్యాంకు తెచ్చుకోవడం చూసి గ్రామానికి చెందిన మిగతా వారు కూడా పిల్లల్ని ఆ పాఠశాలలోనే చేర్పించారు. అయితే తన కుమారుడి బోగస్ ర్యాంకు చూపి పాఠశాల వారు బిజినెస్ చేసుకుంటున్నారని గ్రహించిన ఆ తండ్రి తన కుమారుడిని వేరే పాఠశాలలో చేర్పించాడు.
- ఇటీవల బోథ్ మండల కేంద్రంలోని రెండు పాఠశాలల్లో ఓ సంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతి తరగతి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆయా పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. పత్రిక ప్రకటన సైతం విడుదల చేశాయి. బహుమతులను ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో సదరు సంస్థ ద్వారా అందుకుంటున్నట్లు పేర్కొన్నాయి. అయితే ఈ రెండు పాఠశాలల విద్యార్థులే ఏటా జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తుండడం గమనార్హం. అయితే చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులకు సైతం ర్యాంకులు రావడమే అనుమానాలకు తావిస్తోంది.



బోథ్: విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు వివిధ సంస్థలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మ్యాథ్స్ ఒలింపియాడ్, ఇతర టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నాయి. అయితే వీటి నిర్వహణ తీరే అనుమానాలకు తావిస్తోంది. పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం వారం ముందే ప్రైవేట్ పాఠశాలలకు చేరుతున్నాయి. దీంతో ఆయా యాజమాన్యాలు విద్యార్థులతో కాకుండా ఉపాధ్యాయులతో పరీక్ష రాయిస్తున్నాయి. ఇందులో కొన్నింటిని ఎంపిక చేసి ఆ జవాబు పత్రాలను విద్యార్థులే రాసినట్లుగా సదరు సంస్థకు పంపిస్తున్నాయి. దీంతో ప్రతీ తరగతి నుంచి ఒకరు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎంపికవుతున్నారు. ఈ తతంగం జిల్లాలోని చాలా ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతుండడం గమనార్హం.

ర్యాంకుల కోసం దిగజారుతూ..
విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఆయా సంస్థలు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తుంటాయి. మెరుగైన ర్యాంకు పొందిన వారికి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తుంటాయి. దీన్నే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయి. తమ బడికి మంచి పేరు రావాలనే ఉద్దేశంతో ర్యాంకులు తెచ్చేందుకు ఉపక్రమిస్తున్నాయి. ఈ పరీక్షలు నిర్వహించే సంస్థలు ఆయా పాఠశాలలకు వారం ముందే ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్‌లను చేరవేస్తాయి. దీంతో యాజమాన్యాలు ప్రతి విద్యార్థి నుంచి రూ.100 నుంచి 300 వరకు ఫీజు రూపంలో వసూలు చేసి పరీక్ష నిర్వహించినట్లు ఆయా సంస్థలకు తెలియజేస్తాయి. ప్రతీ తరగతి నుంచి ఒకరు లేదా ఇద్దరిని ఎంపిక చేస్తున్నాయి. అయితే ఇందులో ప్రతిభ కనబరిచే వారిని కాకుండా పలుకుబడి ఉన్న పేరెంట్స్‌కు సంబంధించిన పిల్లలకు ర్యాంకులు వచ్చేలా చూస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో తమ పాఠశాలకు అధిక సంఖ్యలో ప్రవేశాలు ఉండేలా జిమ్మిక్కులు చేస్తున్నాయి. ఇలా ప్రతి గ్రామం నుంచి విద్యార్థులను ఎంపిక చేసి వారి ఓఎంఆర్ షీట్‌లలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బబ్లింగ్ చేయిస్తున్నారు. అనంతరం వాటిని సదరు సంస్థకు పంపుతున్నారు. ఈక్రమంలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి ర్యాంకులను పొందుతున్నట్లు తెలుస్తోంది. దీనిని ఆయా యాజమాన్యాలు తమ ప్రచార అస్త్రంగా మలుచుకుంటున్నాయి. ఇలా అడ్మిషన్ల కోసం అడ్డదారులు తొక్కుతున్న ప్రైవేట్ పాఠశాలలను కట్టడి చేయాల్సిన విద్యాశాఖ అధికారులు వాటిని పట్టించుకోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉపాధ్యాయులతో పరీక్షలు రాయించడం సరికాదు
పలు సంస్థలు ప్రైవేట్ పాఠశాలల్లో టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నాయి. ఇందులో విద్యార్థులకు బదులు ఉపాధ్యాయులు పరీక్ష రాయడం మంచి పద్ధతి కాదు. పాఠశాలకు పేరు రావడం కోసం ఇలాంటి చర్యలు చేస్తే చీటింగ్ చేసిన వారవుతారు. – ప్రణీత, డీఈవో

'పది' పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

- పలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. విద్యార్థులు కేంద్రాలకు నిర్దేశిత సమయానికంటే ముందుగానే చేరుకున్నారు. అధికారులు వారిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం లోనికి అనుమతించారు. తొలిరోజు పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 10,514 మందికి గాను 10,463 మంది హాజరయ్యారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 36 మందికి గాను 29 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఈవోను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. హాల్‌టికెట్ చూపించిన వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదిలాబాద్ పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలను, డీఈవో ప్రణీత 6 పరీక్ష కేంద్రాలను, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి 6 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు మిగతా కేంద్రాలను తనిఖీ చేశారు.

మహనీయుల చరిత్ర భావితరాలకు అందించాలి



కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: తెలంగాణ కోసం పనిచేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేలా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కలెక్టర్ పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొమురయ్య పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజలింగు, బీసీ సంక్షేమ సంఘం, వివిధ బీసీ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

కైలాస్‌నగర్: సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీల్లో ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా, ట్రెయినీ కలెక్టర్ శ్రీజతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దరఖాస్తుదారుల సమస్యలకు పరిష్కారం చూపే విధంగా అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు పరిశీలించి, సాధ్యాసాధ్యాల మేరకు వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య మహిళ, కంటి వెలుగు కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జిల్లాలోని ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, రిమ్స్ ఆసుపత్రి వైద్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని డీఆర్డీవోను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యాచరణపై శాఖల వారీగా ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, జెడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో రమేశ్‌రాథోడ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలి @ రూ.272

- రూ.15పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు
- ఈ నెల 1నుంచే అమల్లోకి

జిల్లాలో జాబ్ కార్డులు : 1.68లక్షలు
ఉపాధి హామీలో నమోదైన కూలీలు : 3.37లక్షలు
ప్రస్తుతం పనులకు హాజరవుతున్న కూలీలు : 22,241
2023–24 ఆర్థిక సంవత్సరం పనిదినాల లక్ష్యం : 43.76లక్షలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కైలాస్‌నగర్: వేసవి భత్యం నిలిపివేతతో ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం కొంత ఊరట నిచ్చింది. దినసరి కూలి మరో రూ.15 పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ఉపాధి కూలి రూ.272 లభించనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులకు వర్తింపజేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఈ నెల 1నుంచి పెరిగిన కూలి చెల్లించనున్నారు. ఉపాధి హామీ పనులకు ఏప్రిల్, మే, జూన్ నెలలే కీలకం కానుండటంతో ఈ సమయంలో పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెరిగే అవకాశముంటుంది. కూలి తాజా పెంపుతో వీరందరికి ప్రయోజనం చేకూరనుంది.

22వేల మంది మాత్రమే
ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ (ఎన్ఎంఎంఎస్) సిస్టం అమలు కూలీలకు ఇబ్బందికరంగా మారింది. పనులకు హాజరయ్యే కూలీల హాజరును ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఫొటోగ్రఫీతో నమోదు చేస్తున్నారు. దీనికి తోడు చేసిన పనికి సంబంధించిన కూలి చెల్లింపుల్లోనూ తీవ్ర జాప్యం అవుతోంది. కూలీల జాబ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డుతో అనుసంధానమై ఉంటే తప్పా కూలి రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి పనులకు వచ్చేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కేవలం 22,241 మంది మాత్రమే పనులకు హాజరవుతుండడం పరిస్థితికి అద్దం పడుతుంది.

ఈ మూడు నెలలే కీలకం
ఉపాధి పనులకు మూడు నెలలే కీలకం. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాగు పనులు అంతగా ఉండవు. ఈ క్రమంలో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగే అవకాశముంటుంది. నూతన ఆర్థిక సంవత్సరం కూడా ప్రారంభం కావడంతో ఈ ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేదిశగా ఈ మూడు నెలల్లో వీలైనంత ఎక్కువ మంది కూలీలకు పని కల్పించేలా అధికారులు దృష్టి సారించనున్నారు. అలాగే కూలి పెంపు వారికి ప్రయోజనకరంగా మారనుంది. ప్రస్తుతం రోజు వారి కూలి రూ.257 ఉండగా ఇకపై రూ.272 చెల్లించనున్నారు. అయితే జిల్లాలో సగటు రోజు వారి కూలి ప్రస్తుతం రూ.204 మాత్రమే లభిస్తోంది. వేసవి మండుటెండలో కూలీలు చేసే పనులకు గాను గతంలో కేంద్రం ప్రత్యేక భత్యం చెల్లించేది. ఏప్రిల్, మే నెలల్లో 30శాతం అదనంగా ఇచ్చేవారు. రెండేళ్లుగా దాన్ని నిలిపివేసింది. ఈ క్రమంలో పెరిగిన కూలి వారికి కొంత ఊరటనిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి
ఉపాధి హామీ కూలిని కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి జరిగే పనులకు గాను హాజరయ్యే కూలీలకు దినసరి కూలి రూ.272 చొప్పున లభించనుంది. జిల్లాలో ఉపాధి పనులను వేగవంతం చేశాం. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ కూలీ తమ జాబ్‌కార్డు, బ్యాంక్ ఖాతాలను ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా కూలి సకాలంలో పొందేందుకు అవకాశముంటుంది. – రాథోడ్ రవీందర్, ఏపీడీ, డీఆర్డీఏ

దేశం చూపు తెలంగాణ వైపు

- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్



అంకోలిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్

గుడిహత్నూర్: తెలంగాణ సంక్షేమం వైపే దేశమంతా చూస్తోందని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ అన్నారు. మండలంలోని సీతాగోందిలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారన్నారు. మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు నిత్యం బీఆర్ఎస్‌లో చేరడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అలాగే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ అధికార ప్రతినిధి కిరణ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బ్రహ్మానంద్, నీలాబాయి, స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి, బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా మండలంలోని అంకోలి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, మాజీ ఎంపీ నగేష్, ఎంపీపీ రమేష్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర విజయ లక్ష్మి రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగులు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రీవెన్స్ నిర్వహించే సమావేశ మందిరం వద్దకు చొచ్చుకొచ్చారు. అక్కడే బైఠాయించి కలెక్టర్, జిల్లా సంక్షేమాధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్ రాజ్ స్వయంగా వారి వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూం అందించాలని కోరగా కలెక్టర్ స్పందిస్తూ మూడు రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు. అలాగే బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని, పెన్షన్లు ప్రతి నెలా మొదటి వారంలోనే అందించేలా చూడాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం దివ్యాంగులతో సమావేశం నిర్వహించాలని కోరగా చర్యలు చేపట్టాలని సంక్షేమాధికారి మిల్కాను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

'బీజేపీని ఎవరూ ఆపలేరు'



మాట్లాడుతున్న అల్జాపూర్ శ్రీనివాస్

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి రాకుండా ఎవరూ ఆపలేరని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా పదాధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో పకడ్బందీగా కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ ఈ నెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం పండుగలా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ఆదినాథ్, రవి, దినేష్ మటోలియా, రాందాస్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును సోమవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మర్యాదపూర్వకరంగా కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలను విన్నవించారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలుగా మార్చాలని, అదేవిధంగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు.

రేపు అడెల్లి ఆలయంలో బహిరంగ వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు అమ్మవారికి సమర్పించే ఒడి బియ్యం పోగు చేసుకునేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఈవో రవికిషన్ తెలిపారు. ఈ వేలానికి గంట ముందు వ్యాపారులు దరావత్తు సొమ్ము చెల్లించి పాల్గొనాలని ఆయన సూచించారు.

మిస్సింగ్ కేసు


గంగాధర్ (ఫైల్)

తానూరు: మండలంలోని మహాలింగి గ్రామానికి చెందిన కార్పె గంగాధర్ (32) కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. గంగాధర్ ఆర్‌ఎంపీ వైద్యుడిగా గ్రామంలో పనిచేసేవాడు. ఈ నెల 1న పని నిమిత్తం భైంసాకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గంగాధర్ తండ్రి పిరాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీకేసులో ఒకరి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్:ఆదిలాబాద్‌లో ఇటీవల ఇందిరానగర్‌కు చెందిన వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగలించిన కేసులో సోమవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. రెండురోజుల క్రితం ఇద్దరిని అరెస్ట్ చేయగా వీరిలో ఒకరు మైనర్ బాలురు ఉన్నారు. వీరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ చోరీ

ముధోల్: మండలంలోని తరోడ గ్రామానికి చెందిన బూసి ఓమేశ్వర్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దొంగలించారని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తల్లిదండ్రులకూ పరీక్షే..!


ప్రాథమిక పాఠశాల వద్ద వంటలు సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులు

- టెన్త్ విద్యార్థులకు తోడుగా తల్లిదండ్రులు
- కరంజి(టి) విద్యార్థులకు అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రం
- 25 కి.మీ దూరంతో ఆందోళన
- రోడ్డు, రవాణా సౌకర్యం అంతంత మాత్రమే
- అందర్‌బంద్‌కు పిల్లలతో తల్లిదండ్రుల బస
- వారానికి సరిపడా కిరాణా సామగ్రి కొనుగోలు

తాంసి: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని భీంపూర్, అర్లి(టి), కరంజి(టి), అందర్‌బంద్ పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారు. కరంజి(టి) నుంచి పరీక్ష కేంద్రానికి సుమారు 25 కి.మీ దూరం ఉంది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు గంటకు పైగా ప్రయాణం, దీనికి తోడు అంతరాష్ట్ర రహదారిపై పూర్తిగా గుంతలమయంగా ఉంది. సరైన రవాణా సౌకర్యం లేదు. సకాలంలో చేరుకునే అవకాశం లేకపోవడంతో పిల్లల వెంట తల్లిదండ్రులు అందర్‌బంద్‌కు పయనమయ్యారు. వారానికి సరిపడా కిరాణా సామగ్రిని, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకుని అక్కడికి వెళ్లారు.

జీపీ భవనం, ప్రాథమిక పాఠశాలలో బస..

కరంజి(టి) పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి నిత్యావసర సామగ్రితో అందర్‌బంద్‌కు వచ్చారు. పరీక్షలు ముగిసే వరకు పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాలలో వారు ఉండనున్నారు. వారి సౌకర్యార్థం పంచాయతీ భవనంలో సర్పంచ్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులు ఉదయం పరీక్ష రాస్తుండడం, వారికి సమయానికి వంట సిద్ధం చేసి పెడుతున్నారు తల్లిదండ్రులు. వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతిఏటా పది పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అందర్‌బంద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే వచ్చే సంవత్సరం అర్లి(టి)లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

పరీక్ష కేంద్రం మార్చాలి



కరంజి(టి) గ్రామానికి పరీక్ష కేంద్రం దూరంగా ఉండటంతో రావడానికి ఇబ్బంది పడుతున్నాం. గ్రామానికి కనీసం బస్సు సౌకర్యం సరిగ్గా లేదు. తల్లిదండ్రులు తమను తీసుకొచ్చి అక్కడే ఉంచి పరీక్ష రాయిస్తున్నారు. వచ్చే సంవత్సరం పరీక్ష కేంద్రం మార్చాలి.

– డి.అమూల్య, విద్యార్థిని కరంజి(టి)

పరీక్ష కేంద్రం దూరంతో ఇబ్బంది



కరంజి(టి) నుంచి అందర్‌బంద్ పరీక్ష కేంద్రం దూరంగా ఉంది. కేంద్రం రావడానికి సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేదు. కేంద్రానికి సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు. వారం పాటు ఇక్కడే ఉండి పరీక్షలు రాయాలని తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఇక్కడే ఉంటున్నాం.

– అలాలి చరణ్, విద్యార్థి, కరంజి(టి)

ఇక్కడే ఉంటున్నాం..



పది పరీక్షలు విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని వారితో కలిసి అందర్‌బంద్‌లో ఉంటున్నాం. ఇక్కడ ఉండి వారికి భోజనం, ఇతర అవసరాలను దగ్గరుండి చూస్తున్నాం. ప్రతి ఏటా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. పరీక్ష కేంద్రం మార్చాలి లేకపోతే విద్యార్థుల పరీక్షల సమయంలో అధికారులు వసతులు కల్పించాలి.

– అలాలి రమేశ్, విద్యార్థి తండ్రి, కరంజి(టి)


అందర్‌బంద్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు


అందర్‌బంద్ పంచాయతీ భవనంలో చదువుతున్న విద్యార్థులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం




గుడిహత్నూర్: మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహిస్తున్న సప్తాహం ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం ప్రారంభమైన రథోత్సవం ప్రధాన వీధుల గుండా సాగింది. హనుమాన్ దీక్షాపరులు రథాన్ని లాగారు. ఈ శోభాయాత్రలో మహిళలు, యువతీ, యువకులు డీజే పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ పటేల్ వామన్ గిత్తే దంపతులు పెళ్లి పెద్దగా వ్యవహరిస్తూ కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, బీజేపీ రాష్ట్ర మహిళా సభ్యురాలు సుహాసిని రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొన్నారు.



కల్యాణం కమనీయం



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానం 66వ వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం కమనీయంగా జరిగింది. పండితులు వేదమంత్రోచ్చరణ మధ్య కల్యాణ తంతు జరిపించారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.నవీన్‌కుమార్, కార్యనిర్వాహణ అధికారి ఆర్.రవికిషన్, ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను వాహనాల్లో తరలించాలని ఐటీడీఏ ఉన్నతాధికారులు ఆదేశించారు. వాటికి సంబంధించి రవాణా చార్జీలను సైతం అందజేస్తున్నారు. దీంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేట్ వాహనాలను సమకూర్చుకున్నారు. ఇదిలా ఉండగా వాన్‌వాట్ ఆశ్రమ పాఠశాలలో 34 మంది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. వీరిని పరీక్ష కేంద్రానికి తరలించేందుకు ఒక్కటే ఆటోను ఏర్పాటు చేసి రెండు ట్రిప్పుల చొప్పున తరలించారు. ఒక్కొక్క ట్రిప్పునకు 17 మంది చొప్పున తరలించారు. ఆటో లోపల కూర్చోవడానికి స్థలం లేక వేలాడుతూ ఎండలో ప్రమాదం అంచున విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని 'సాక్షి' సంప్రదించగా మంగళవారం నుంచి ట్రిప్పుల సంఖ్య పెంచుతామని తెలిపారు.

ఆటో బోల్తా

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

జైనథ్: మండలంలోని పూసాయి గ్రామ సమీపంలో 44 నెంబర్ జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..మహారాష్ట్రలోని ఘటంజి తాలూకా దేవుదరి గ్రామానికి చెందిన గౌతమ్ (40) గత రెండేళ్లుగా తన భార్య పిల్లలతో కలిసి ఆదిలాబాద్‌లోని రిక్షా కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం తన భార్య, ఇద్దరు పిల్లలు, బంధువులతో కలిసి తన స్వగ్రామమైన దేవుదరికి ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో పూసాయి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గౌతమ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతుడి సోదరుడు గజానంద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న రాజేష్

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామ 61వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కిందపడటంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన యువకుడు సిర్ల రాజేష్ తన మిత్రుడు నదీమ్‌తో కలిసి బైక్‌పై నిర్మల్ వెళ్లారు. అక్కడ పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో రాజేష్ తలకు తీవ్రగాయమైంది. మిత్రుడు నదీమ్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

భూవివాదంలో ఇరువర్గాల దాడి

ఇచ్చోడ: మండలంలోని తలమద్రి గ్రామంలో సోమవారం భూ వివాదంలో ఇరువర్గాల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తలమద్రి గ్రామంలో గసకంటి రాజన్న, గణేశ్‌కు చెందిన వ్యవసాయ భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన మునేశ్వర్ కోటేశ్వర్, పాముల గణేశ్, చిరంజీవిలు ఆ భూమిలో దున్నడానికి ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల దాడిలో తీవ్రగాయాలైన రాజన్న, గణేశ్‌లు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'పది'లంగా పరీక్షకు..


నిర్మల్‌లో హాల్‌టికెట్ నంబర్ చూస్తూ..


చింతలమానెపల్లిలో..


దండేపల్లి: లింగాపూర్‌లో స్క్రైబ్ సాయంతో పరీక్షకు అంధ విద్యార్థి


కెరమెరిలో..


దహెగాంలో..


దండేపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


నార్నూర్ లో పరీక్ష రాస్తున్న అంధ విద్యార్థి అనిల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. విద్యార్థులు ఉదయం 9గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకుని వారివారి హాల్‌టికెట్ నంబర్లు చూసుకోవడంలో బిజీగా మారారు. గ్రామాల నుంచి పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు పలువురు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అలాగే ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సైతం వాహనాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రానికి తరలివచ్చారు. అయితే కడెం మండలంలో విద్యార్థి రోహిత్ తండ్రి ఆదివారం రాత్రి మృతిచెందగా పుట్టెడు దుఃఖంతో పరీక్షకు హాజరు కాగా పలువురు దివ్యాంగ విద్యార్థులు సైతం పది పరీక్షలు రాశారు.


తాంసి: కప్పర్ల పాఠశాలలో నానమ్మ గంగుబాయితో విద్యార్థి సిద్దార్థ్


కడెం: తండ్రి మరణించిన పరీక్ష రాసేందుకు వచ్చిన తక్కళ్ల రోహిత్


నెన్నెల: అంజనేయుడికి మొక్కుతున్న విద్యార్థినులు


కాసిపేట: మోడల్ స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్ చూస్తూ..


నిర్మల్‌లోని బాలికల ఉన్నత పాఠశాల గేటు వద్ద..